క్లుప్తంగా

వృథాగా మిషన్ భగీరథ నీరు



రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. భగీరథ పైపులైన్‌లు తరచూ లీకేజీ అవుతున్నాయని, ఫలితంగా ఇళ్లకు సరఫరా అయ్యే మంచి నీరు రోడ్డుపై వృథాగా పోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



నరహరిని సన్మానిస్తున్న ఎంపీడీఓ వెంకయ్య, అధికారులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జె.నరహరి బుధవారం పదవీ విరమణ పొందగా.. ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకయ్య, ఎంపీఓ గిరిరాజు, పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పూలమాల, శాలువా కప్పి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. నరహరి ఉద్యోగ జీవితంలో ఎంతో చురుకుగా ఉంటూ సమస్యలు పరిష్కరించే వారని గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా శంకర్‌పల్లి ఏపీఎంగా విధులు నిర్వర్తించి, ఇటీవలే చేవెళ్ల ఏపీఎంగా బదిలీ అవుతున్నా భీమయ్యను ఎంపీడీఓ, అధికారులు సత్కరించారు.

పరిహారం చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

శంకర్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాస్ విధులు నిర్వహిస్తూ ఫిట్స్ వచ్చి మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్మికుడు కుటుంబానికి న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. విధులు నిర్వర్తిస్తున్నప్పుడే మృతి చెందినందున కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అధికారులు స్పందించక పోతే కార్మికులంతా నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులతో కమిషనర్ యోగేశ్ మాట్లాడి, విషయాన్ని స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాములు, క్రిష్ణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతపై గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణ, నర్సరీల్లో మొక్కల పెంపకం, వన మహోత్సవం, పన్ను వసూళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ గిరి రాజు, పంచాయతీరాజ్ ఏఈ నందకిశోర్ పాల్గొన్నారు.

సర్వీస్ దారి.. అధ్వానంగా మారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- బీటీరోడ్లుగా నిర్మించాలని డిమాండ్



చటాన్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు

షాద్‌నగర్: జాతీయ రహదారికి సమాంతరంగా ఉన్న సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయి. ఉన్న మట్టిరోడ్డు వర్షాలకు గుంతలుగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రహదారి పక్కన ఉన్న గ్రామాల ప్రజలు తమ గమ్యాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్లను బీటీరోడ్డుగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తప్పని దూరభారం

2009లో షాద్‌నగర్ పట్టణ శివారులో నుంచి జాతీయ రహదారి బైపాస్ రోడ్డుగా నిర్మించినా, నేటివరకు పక్కన ఉన్న సర్వీసు రోడ్లు నిర్మించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులను విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సర్వీసు రోడ్లు నిర్మిస్తే జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో సులభంగా ఉంటుంది. ఈ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు చుట్టూ తిరిగిరావడంతో దూరం పెరిగిపోతోందని, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

మట్టిరోడ్డే దిక్కు

షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి చౌరస్తా నుంచి కొత్తపేట రోడ్డు అండర్‌పాస్ వరకు సర్వీసు రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా పట్టణ శివారులోని కేశంపేట బైపాస్ నుంచి సోలీపూర్ గ్రామానికి వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సోలీపూర్ గ్రామానికి వెళ్లాలంటే జాతీయ రహదారి పక్కన ఉన్న మట్టిరోడ్డు గుండా బ్రిడ్జి కింది నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చటాన్‌పల్లి నుంచి నందిగామ వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన లింగారెడ్డిగూడ గ్రామ శివారులో సర్వీసు రోడ్డులో చెరువునీరు నిలిచింది. దీంతో ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలి



జాతీయ రహదారి పక్క నుంచి సోలీపూర్ గ్రామానికి మట్టిరోడ్డు గుండా వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే బ్రిడ్జి వద్ద నీరు నిలుస్తున్నాయి. అధికారులు స్పందించి బీటీరోడ్డుగా నిర్మించాలి.

– జంగయ్య, సోలీపూర్

చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారి పక్కన ఉన్న మట్టిరోడ్డును అధికారులు అభివృద్ధి చేయాలి. బీటీరోడ్డుగా నిర్మిస్తే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రోడ్డు పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లేందుకు సౌలభ్యం అవుతుంది.

– శ్రీనునాయక్, షాద్‌నగర్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చంద్రాయన్‌గూడలో డ్వాక్రా భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: గ్రామాలను పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ అనుబంధ గ్రామం చంద్రాయాన్‌గూడ, మేకగూడ, రంగాపూర్ గ్రామాల్లో ఆయన బుధవారం సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, బీటీ రోడ్లు, అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలు, పాఠశాలలు తదితర వాటని ఇప్పటికే మంజూరు చేశామని స్పష్టం చేశారు. మొదటగా ఆయన రంగాపూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం, చంద్రాయాన్ గూడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 15 లక్షల వ్యయంతో డ్వాక్రా భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం

రిలే నిరాహార దీక్షలో బీసీ సంఘం నాయకులు



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకుడు నర్సింలు

షాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు పోరాటం ఆగదని బీసీ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 4వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన వాటా అని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్య, ఉపాధిలో కూడా రిజర్వేషన్ కావాలన్నారు. బీసీల మనోభావాలు దెబ్బతీసేట్లు జీవో తీశారని, బీసీ బిడ్డలు మేలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కేశంపేట: కొత్తపేటలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రశేఖర్



షాద్‌నగర్‌రూరల్: రాయికల్ అంగన్‌వాడీలో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: తల్లితండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఎంఈఓ మనోహర్ సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ అంగన్‌వాడీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు తల్లితండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచే తమ పిల్లలను విద్యవైపు ప్రోత్సహించాలని సూచించారు. అంగన్‌వాడీ పూర్తి చేసుకున్న తర్వాత పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, చిన్నారులకు ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుందని తెలిపారు. అనంతరం డాక్టర్ బిందు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం భాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్వేత, మహిళా సంఘం అధ్యక్షురాలు యశోద, అంగన్‌వాడీ టీచర్లు మమత, సుజాత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కేశంపేట: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తిసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేటలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శమంతకమణి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై మట్టిపోయించి చదును చేయిస్తున్న యువకులు, నాయకులు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డుకు వెళ్లే రోడ్డుకు బుధవారం స్థానికులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. చేవెళ్ల నుంచి ఊరేళ్ల వార్డుకు 5 కి.మీ. మేర సింగిల్ రోడ్డు ఉంది. గతంలో దాదాపు 3 కిలో మీటర్ల మేర కూడా ఈ రోడ్డుకు దాతల సహాయంతో చుట్టుపక్కలా మట్టిపోయించి బాగుచేయించారు. మిగిలిపోయిన రెండు కిలోమీటర్లు అలాగే ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాల్వలుగా ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా దీనిని పట్టించుకునే వారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊరేళ్లకు చెందిన పలువురు నాయకులు, యువకులు ఊరడి నర్సింలు, సీహెచ్ యాదయ్య, జోషి అశోక్, మోబిన్, బీరప్ప తదితరులు ముందుకొచ్చి సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించి అంతా కలిసి ఈ రోడ్డును బాగు చేయించుకుందామని తోచిన విధంగా చందాలు ఇవ్వాలని కోరారు. స్పందించి ప్రజలు ఇచ్చిన చందాలతో నాయకులు, యువకులు రోడ్డు సమస్య తీర్చారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వార్డుకు చెందిన ప్రజలు జావిద్, ఆసిఫ్, రమేశ్, జిషాన్, రాములు, ఆత్మలింగం, శరీఫ్, రవి, మహేశ్, పెంటయ్య, రాములు, శేఖర్, బషీర్, శివ, రాజు, తదితరులు ఉన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

వైస్ ప్రిన్సిపాల్ పాలాది శ్రీనివాసులు



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

షాద్‌నగర్: విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వైస్ ప్రిన్సిపాల్ పాలిది శ్రీనివాసులు అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీజే అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యలు అభ్యసించి దేశ అత్యున్నత పదవిని అలంకరించారన్నారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. పేదరికం చదువు అడ్డుకాదని చెప్పడానికి అబ్దుల్‌కలాం మంచి ఉదాహరణ అన్నారు. మహనీయుడి నమ్మకాన్ని యువత వమ్ము చేయకూడదని, అందరూ కలాంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ జయ, డాక్టర్ అనురాధ, డాక్టర్ నదీరా బేగం, సుష్మిత, చామంతి, సందీప్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో

పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్టర్ అహ్మద్‌ఖాన్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అప్పోజీగూడలో బుధవారం కేఎంఆర్ ఫౌండేషన్, కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు బీపీ, మధుమేహం, రక్తపరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, వైద్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభమైందని, రైతులను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను గ్రామాల్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. నాణ్యమైన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తామన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు

సీడీపీవో ఉదయ



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు

కొత్తూరు: బాల్య వివాహాలు చేసుకుంటే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఐసీడీఎస్ సీడీపీవో ఉదయ విద్యార్థినులకు తెలిపారు. పట్టణంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన పోషకాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంతేకాకుండా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచే సరైన పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యాల బారిన పడకుండా శారీరకంగా దృఢంగా ఉంటారని వివరించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి, ఎంఈఓ అంగూర్‌నాయక్, సూపర్‌వైజర్లు రేవతి, లక్ష్మీబాయి, విజయలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి

చేవెళ్ల: విద్యార్థులు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, ఊరేళ్ల, కమ్మెట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రొజెక్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్ఎం మాట్లాడుతూ.. చదువుకునే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు వారి ఉన్నత భవిష్యత్తుకు ఉపయోగపడుతాయన్నారు. పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పదో తరగతి తర్వాత కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయనే విషయాలను తెలియజేశారు. లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ కె.సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహాన్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిరోజు యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహాన్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ్‌జహాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శీతాకాల శిబిరం(ఎన్ఎస్ఎస్ క్యాంపు) బుధవారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రజలకు యోగాసనాలను వేయించడంతో పాటుగా వ్యాయామం చేయించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గోడలపై ఆరోగ్య సూత్రాలను రాస్తూ చిత్రాలను గీశారు.

పశువులకు గాలికుంటు టీకాలు



చేవెళ్లలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి తిరుపతిరెడ్డి

చేవెళ్ల: మూగజీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు పాడిరైతులు తప్పనిసరిగా సకాలంలో టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు తిరుపతిరెడ్డి, శిరీష తెలిపారు. చేవెళ్ల మండలంలోని పలుగుట్ట, ఆలూరు, దామరగిద్దలో బుధవారం పశువులకు ఉచితంగా వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదిరురులు పాల్గొన్నారు.

షాబాద్: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దూరు, రేగడిదోస్వాడ, కుమ్మరిగూడ, మాచన్‌పల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆయన పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మొయినాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో బుధవారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా 96 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

మొయినాబాద్‌రూరల్: రైతులు పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి అహ్మద్, అమ్డాపూర్ పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్డాపూర్‌లో పశువులకు వారు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



షాబాద్: మద్దూరులో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో టీకాలు వేస్తున్న డాక్టర్ దేవిరెడ్డి



మొయినాబాద్: సురంగల్‌లో టీకాలు వేస్తున్న పశువైద్యులు